# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## కేంద్ర కమిటి

**పత్రికా ప్రకటన**

## బ్రాహ్మణీయ హిందూమత దురహంకార విధానాల పరంపరలో భాగమే

## గోహత్యా నిషేధం!

ఈ మధ్య రెండు రాష్ట్రాల్లో – హర్యానా, మహారాష్ట్ర – గోహత్యా నిషేధ చట్టం అమలులోకి వచ్చింది. వీటితో మన దేశంలో గోహత్యా నిషేధ చట్టం అమలు అవుతూన్న రాష్ట్రాల సంఖ్య 25కు చేరింది. దేశంలోని బీహార్, కేరళ, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాలు మినహా ఇప్పటికీ అన్ని రాష్ట్రాల్లో ఆ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. వివిధ మతాలకు, అనేక కులాలకు, తెగలకు నిలయమైన మన విశాల భారత దేశంలో గోహత్యా నిషేధం ప్రకటించడం బ్రాహ్మణీయ హిందూమత దురహంకార ఆధిపత్య విధానాలలో భాగమే తప్ప మరేమీ గాదు. ఈ అప్రజాస్వామిక, అలౌకిక చట్టాన్ని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

మన దేశంలో అనేక మతాలు సహజీవనం చేస్తున్నాయి. వీటిలో ఇస్లాం(ముస్లిం) మతస్థులు దాదాపు 15 శాతానికి పైబడి ఉన్నారు. దేశంలోని కుత్సితమైన కుల వ్యవస్థ ఫలితంగా ప్రజలు వేలాది కులాల్లో చీల్చబడి ఉన్నారు. 18 శాతానికి పైబడి దళితులున్నారు. దేశంలో శ్రామిక కులాలే అత్యధికం, కాగా దేశ జనాభాలో 8.8 శాతం ఆదివాసీ ప్రజలున్నారు. దేశంలో ఆచార సంప్రదాయాలు, కట్టుబాట్లు, పండుగలు ఇతర సాంస్కృతిక జీవనం ఎవరిది వారికి ఉంది. కానీ దోపిడీ పాలకవర్గాలు వీటన్నింటినీ హీనాతిహీనంగా చూస్తూ బ్రాహ్మణీయ హిందూమత దురహంకార ఆధిపత్య విధానాలను రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అందరిపై రుద్దుతున్నాయి. గొప్ప ప్రజాస్వామ్య దేశంగా, సెక్యులర్ రాజ్యంగా గొప్పలు చెప్పుకుంటూ దేశంలోని అత్యధిక మెజార్టీ పీడిత, శ్రామిక ప్రజలపై బ్రాహ్మణీయ హిందూమత ఆధిపత్య విధానాలను ప్రభుత్వాలు రుద్దుతున్నాయి. దేశంలో కష్టించి పనిచేసే శ్రమజీవుల సాంస్కృతిక జీవనం మహా దుర్భరంగా ఉంటోంది. వారు తమ ఆత్మ గౌరవం కోసం జరిపిన అనేక జీవన్మరణ పోరాటాల ఫలితంగా ఏవో కొద్దిపాటు హక్కులు రాజ్యాంగంలో చోటుచేసుకున్నాయి. కానీ దేశంలో దినదినం తీవ్రమవుతోన్న సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా అవన్నీ హరించివేయబడుతున్నాయి. దేశానికి సోకాల్డ్ స్వాతంత్ర్యం లభించి 68 ఏళ్లు అవుతోన్నా నేటికీ మనుషుల మలాన్ని మోసుకెళ్లే దుస్థితిలో వేలాది ప్రజలు జీవించడం అతి దారుణమైన విషయం. ఈ దేశంలో సకల సంపదలను సృష్టించే శ్రామిక కులాలను దేవుడి గుళ్లోకి అనుమతించరు. వారికి హోటళ్లలో విడిగా గ్లాసులు ఉంటాయి. వారికి ప్రత్యేక నీటితావులు ఉంటాయి. వారి ఇండ్లు వెలివేసినట్టుగా ఊరి బయట ఉండాల్సిందే. వాళ్లు చచ్చిన పసుల కళేబరాలను మోసుకెళ్లాల్సిందే! వాళ్లు చేయని చాకిరీ లేదు. కానీ ఆ శ్రమను బ్రాహ్మణ మతం గుర్తించదు. వాళ్లను మనుషులుగా గౌరవించదు. వాళ్లను తలెత్తుకొని తిరగనీయదు. వాళ్లను ఆత్మ గౌరవంతో బతుకనీయదు. వాళ్లు అన్ని రకాల హిందూమత అగ్ర వర్ణాల హింస, దౌర్జన్యాలను భరించాలి. దేశంలో పాశవికంగా అమలయ్యే చాతుర్వర్ణ వ్యవస్థ నుంచి బయటపడదానికి శ్రామిక ప్రజలు అన్యమతావలంబకులుగా మారడాన్ని బ్రాహ్మణం అనివార్యం చేసింది. నాగరికత ఎంతగానో విలసిల్లిందిగా మురిసిపోయే అగ్ర వర్ణాలు నేటికీ పల్లెల నుంచీ మహా నగరాల వరకు వివిధ రూపాలలో తమ హిందూమత ఆధిపత్య విధానాలను అమలు చేస్తున్నాయి. ప్రభుత్వాలు ఓ వైపు ప్రజలను పక్కదార్లు పట్టించే చట్టాలను చేస్తూనే మరోవైపు వారి జీవితాలతో నిత్యం క్రూరమైన పరిహాసం చేస్తున్నది.

కేంద్రంలో 2014 మేలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో సంకీర్ణ కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత ప్రజలపై బ్రాహ్మణీయ హిందూ మత ఫాసిస్టు దాడి తీవ్రమైంది. ప్రధానిగా నరేంద్ర మోదీ పగ్గాలు చేపట్టిన తర్వాత హైందవేతర మతాలపై దాడులు పెరిగి ముఖ్యంగా ముస్లిం, క్రైస్తవ ప్రజల జీవితాల్లో భయాందోళనలు తీవ్రమైనాయి. దేశంలో ఓ వైపు ముస్లింలపై అమానవీయ దాడులను తీవ్రం చేస్తూనే మరోవైపు క్రైస్తవ మతస్థులు చర్చిలను ధ్వంసం చేయడం, వారిపై అత్యాచారాలు జరపడం, వారిని అవమానించడం, దుర్భాషలాడడం ఎంతగానో పెరిగిపోయాయి. గత కొద్ది మాసాలుగా దేశవ్యాప్తంగా 'ఘర్ వాపసీ' పేరుతో మరోమారు దళిత, క్రైస్తవ, ఆదివాసీ ప్రజలపై దాడులు తీవ్రమైనాయి. కరుడుగట్టిన కాషాయ నిక్కర్ మార్క్ మహానుభావులు పార్లమెంటులో సైతం తమ చిత్తానుసారంగా వ్యాఖ్యానాలు చేస్తూ హైందవేతర ప్రజల సాంస్కృతిక జీవనంతో పరిహాసం చేస్తున్నారు. పోతే రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ముస్లింల రిజర్వేషన్‌ను సైతం రద్దు చేసి గోహత్యా నిషేధాన్ని చట్టం ద్వారా అమలులోకి తెచ్చారు. హర్యానాలో కూడా గోహత్యా నిషేధాన్ని అమలులోకి తెచ్చారు. ఛత్తీస్‌గడ్‌లో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వోద్యోగులు ఆర్ఎస్ఎస్ శాఖ కార్యకలాపాలలో పాల్గొనడంపై గతంలో ఉన్న నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ రకంగా దేశ వ్యాప్తంగా కాషాయ బ్రిగేడ్ కార్యకలాపాలను ముమ్మరం చేస్తూ అన్ని సెక్షన్‌ల ప్రజలపై బ్రాహ్మణీయ హిందూమతోన్మాద ఫాసిస్టు దాడిని తీవ్రం చేస్తున్నారు. గోహత్యా నిషేధాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్షలను చట్టం రూపొందించింది. దేశంలోని దళితులను, ఆదివాసీలను, ముస్లిం మరియు క్రైస్తవ

మతస్థులను ఊచకోత కోసిన దోషులను సైతం కోర్టులు నిర్దోషులుగా ప్రకటిస్తున్నాయి. చుండూర్, ఖైర్లాంజీ తీర్పులను తాజా ఉదాహరణలుగా చెప్పవచ్చు. తమిళనాడు రాష్ట్రంలో గోహత్యా నిషేధం అమలులో లేనప్పటికీ అక్కడి మాజీ ముఖ్యమంత్రి జయలలితను మాంసాహారిగా పేర్కొన్నందుకు అక్కడి ప్రముఖ సమాచార పత్రిక 'నక్కీరన్' కార్యాలయాన్ని 2012లో ఆ పార్టీ గూండాలు ధ్వంసం చేశారు. అక్కడే హిందూ పత్రిక తన సిబ్బంది కార్యాలయంలోకి మాంసాన్ని తేవడాన్ని బ్రాహ్మణ యాజమాన్య వర్గాలు నిరసించాయి. అంటే అక్కడ నిషేధం అమలులో లేనప్పటికీ మాంసాహార ప్రజలపై బ్రాహ్మణ ఆధిపత్యం దొడ్డిదారిన అమలవుతోంది. ఇలాంటి అప్రజాస్వామిక, అలౌకిక, అశాస్త్రీయ భావాలను, ఆచరణను, విధానాలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.

దేశప్రధాని మోదీ నిస్సిగ్గుగా సెలవిచ్చే కాషాయ సైన్స్ తలాతోక లేని శాస్త్రమే. వాస్తవానికి ఈ దేశంలోని పేద ప్రజలకు కాస్తో కూస్తో పౌష్టికాహారం మాంసం ద్వారానే లభిస్తోంది. సరకుల ధరలు చుక్కలంటుతోన్న పరిస్థితులలో మిగతా మాంసాలకన్నా గోమాంసం సాపేక్షికంగా చౌకగా ఉండడం అందుకు ఒక కారణం. పోతే కొద్ది తెగలలో, కులాలలో గోమాంసం సహా రకరకాల జంతు మాంసాలను తినడం నేటికీ ఆచారంగా ఉన్నది. కోళ్లు, కుక్కలు, పిల్లులు, ఎలుకలు, దున్నపోతులు, ఆవులు, ఎడ్లు, మేకలు, పందులు ఇలా రకరకాల పశువుల, పక్షుల మాంసాలను మాంసాహారులు భుజిస్తారు. దీనిపై నిషేధం విధించడం అప్రజాస్వామికమైనది. అశాస్త్రీయమైనది. నిజానికి ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా విద్యార్థులు బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు సంస్కృతిని గర్హిస్తూ తమ ఆత్మగౌరవాన్ని నిలుపుకోవడంలో భాగంగా 'బీఫ్ ఫెస్టివల్' (గొడ్డుమాంస పండుగ) పేరుతో ఒక కొత్త సంప్రదాయాన్ని ముందుకు తెచ్చారు. అనేక చోట్ల ప్రజలు తమకు తోచిన రూపాల్లో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలను నిరసిస్తూ ఆత్మగౌరవ పోరాటాలకు పూనుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో దోపిడీ పాలక వర్గాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకోవడాన్ని, సెంటిమెంట్లను ప్రజల్లో రెచ్చగొట్టడాన్ని మేధావులు, ప్రజాస్వామికవాదులు, పాత్రికేయులు, రచయితలు, కళాకారులు తీవ్రంగా ఖండించాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. పార్లమెంటులో భూసేకరణ లాంటి ముఖ్యమైన బిల్లులపై ఓ వైపు చర్చలు జరుగుతున్నపుడు, బయట మరోవైపు లక్షలాది రైతాంగం, ప్రజలు ఆ బిల్లులను తీవ్రంగా ఖండిస్తూ ఉద్యమిస్తున్న సమయంలో కాషాయ బ్రిగేడ్ వాటిని పక్కదారి పట్టించడానికి దేశంలో ఒక పథకం ప్రకారం మతోన్మాద చర్యలను రెచ్చగొట్టడాన్ని ప్రజలంతా గ్రహించాలి.

దేశంలో దినదినం తీవ్రమవుతూన్న హిందూ మతోన్మాద చర్యలను ఖండిస్తూ వాటికి వ్యతిరేకంగా హేతుబద్ధ, శాస్త్రీయ, సెక్యులర్ విధానాల అమలుకు ఎక్కడికక్కడే పోరాడాల్సిందిగా మా పార్టీ ప్రజలను కోరుతోంది. ప్రభుత్వాలు ముందుకు తెస్తున్న గోహత్యా నిషేధ చట్టాలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ప్రజల మత, సాంస్కృతిక వ్యవహారాలలో రాజ్యం జోక్యానికి వ్యతిరేకంగా పోరాడాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

విప్లవాభివందనాలతో

అభయ్

అధికార ప్రతినిధి

కేంద్ర కమిటి

23 మార్చి 2015 భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు